సాక్షి
గుంటూరు
శనివారం ౹ 12 ౹ జూలై ౹ 2025



అమ్మవార్లకు ఆషాఢ సారె


భట్టిప్రోలు: వెల్లటూరు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ పరివార దేవాలయంలో అమ్మవార్లకు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు.



గౌరీదేవికి లక్ష కుంకుమార్చన

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని శ్రీగౌరీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శతాబ్ది మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన చేశారు.

శాకంబరిగా కాళీమాత



మంగళగిరి: రాజీవ్ గృహకల్ప రోడ్డులో ఉన్న కాళీమాత ఆలయంలో శుక్రవారం శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

నేడు నృసింహస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నట్లు ఈవో సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవానికి కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కొప్పురావూరి లక్ష్మీశ్రీనివాసరావు దంపతులు వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

సమన్వయంతో ఫ్లై ఓవర్ పనులు

కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ నూతన ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సమన్వయంతో వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు కోసం ప్రత్యామ్నాయ రహదారులు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లు, జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉండే విధంగా ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించుకోవాలన్నారు. ఇప్పటికి ఆక్రమణలు తొలగించిన వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు తదితర వ్యాపారులు సాయంత్రం వేళలో ఇళ్లకు వెళ్లే క్రమంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీసులను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన స్థానిక పెద్దలతో, వ్యాపారస్తులతో నిరంతరం చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జీఎంసీ ఎస్ఈ శివనాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీపీఓ శేషశ్రీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సర్వేలో గుంటూరుకు ప్రథమ స్థానం

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) పారిశుద్ధ్య సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రస్థాయిలో తొలి స్థానంలో నిలవడం అభినందయనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐవీఆర్ఎస్ బృందం పారిశుద్ధ్య పనులకు సంబంధించి రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో చేపట్టిన ప్రజాభిప్రాయ సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ 67 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజూ ఇంటి నుండి చెత్త సేకరిస్తున్నారా, మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లోగా తొలగిస్తున్నారా, లేదా, మీ మునిసిపాలిటీలో డ్రైన్లను శుభ్రం చేస్తున్నారా లేదా అనే మూడు అంశాలపై ఐవీఆర్ఎస్ బృందం చేసిన సర్వేలో గుంటూరు నగర ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపిన మేరకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో గుంటూరు నగరపాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు నగరానికి మంచి పేరు తెచ్చిన ప్రజారోగ్య కార్మికులు, అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

గురజాల తహసీల్దార్ సస్పెన్షన్

గురజాల: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వైవీ కుటుంబ రావును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ రావు గతంలో దాచేపల్లి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సమయంలో కేసానుపల్లి, పెదగార్లపాడు, భట్రుపాలెం, గామాలపాడు గ్రామాల్లో ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ మాసంలో దాచేపల్లి మండలం నుంచి ఆయన గురజాలకు బదిలీపై వచ్చారు.

తిరగబడ్డ రైతుబిడ్డ

- రెండో విడత భూ సమీకరణపై వెనక్కి తగ్గిన కూటమి ప్రభుత్వం
- రాజధాని రైతుల వ్యతిరేకతతో కేబినెట్ నిర్ణయం వాయిదా
- అడ్డం తిరిగిన పొన్నెకల్లు, నిడుముక్కల రైతులు
- ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు
- సొంత సామాజిక వర్గం నుంచే వ్యతిరేకత
- భూ సమీకరణలో లేని గ్రామాల్లో కూడా సభలు
- మొదటికే మోసం వస్తుందన్న భయంతో తాత్కాలికంగా వాయిదా



భూములిచ్చేందుకు వ్యతిరేకం అంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెండోవిడత భూసేకరణలో ప్రభుత్వానికి రైతుల నుంచి వ్యతిరేకత సెగ తగిలింది. సొంత సామాజిక వర్గానికి చెందిన రైతులే తిరగబడటంతో ఒక అడుగు వెనక్కి వేసింది. బుధవారం జరిగిన కేబినెట్ మీటింగ్‌లో దీనిపై నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేసింది. రైతులతో చర్చించి వారిని ఒప్పించి నిర్ణయం తీసుకుంటామంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మొదలు పెట్టింది.

పొంతన లేని లెక్కలు

ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు గ్రామాల్లో జరుగుతున్న తీరుకు సంబంధం లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పూలింగ్ పేరుతో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. పైగా ప్రభుత్వం కూడా ఎక్కడ భూమి తీసుకుంటుందో.. ఏ గ్రామాల్లో ఎంత అవసరమో చెప్పకుండా ఏకంగా గెజిట్ విడుదల చేసింది. ముందు ప్రకటించిన గ్రామాల్లోనే కాకుండా తాడికొండ మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించడం వివాదానికి దారితీసింది. ప్రభుత్వం పైకి చెబుతున్నది ఒకటైతే.. పరోక్షంగా లక్ష ఎకరాలకు పైగా భూసమీకరణ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

తలాతోక లేని అభిప్రాయ సేకరణ

తాడికొండ మండలంలోని మూడు గ్రామాల్లో 7,256 ఎకరాలు, తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాల్లో 10,878 ఎకరాలు, అమరావతి మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 19,504 ఎకరాలు, పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామాల్లో 4,586 ఎకరాలు కలిపి 42,226 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించి గ్రామ సభలు నిర్వహించారు. నోటిఫికేషన్ కూడా వీటికి సంబంధించి విడుదల అయింది.అయితే గెజిట్‌తో సంబంధం లేకుండా అభిప్రాయ సేకరణ పేరుతో తాడికొండ మండలంలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సమీకరణకు భూములివ్వమని స్పష్టంగా తెగేసి చెప్పారు. వినతిప్రతం కూడా అందజేశారు. భూ బాగోతంపై రైతులు బేజాత్పురం, రావెల గ్రామ సభల్లో ప్రశ్నించినప్పటికీ ఎమ్మెల్యే, ఆర్డీవోలు మాట దాటవేత ధోరణే తప్ప సమాధానం చెప్పలేదు.

అడ్డం తిరిగిన రైతులు

నోటిఫికేషన్‌కు ముందు జరిపిన గ్రామ సభలకు సంబంధం లేకుండా గత గురువారం తాడికొండ మండలంలోని పాములపాడు, బేజాత్పురం, రావెల గ్రామాల్లో, తర్వాత రోజు ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించారు. తాడికొండ మండలం పొన్నెకల్లులో రైతులు ఏకంగా అడ్డం తిరిగారు. తాము భూములిచ్చేది లేదంటూ ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు హోరెత్తించారు. అధికారులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మధ్యలోనే వెనుతిరిగారు.

ఎదురు తిరిగిన పార్టీ నేత

మొదటి దశలో భూములు తీసుకున్న రైతులకు న్యాయం చేసిన తరువాతే రెండోదశ పూలింగ్‌కు వెళ్లాలంటూ సీఆర్డీయే సిటిజన్ కమిటీ సమావేశంలో సభ్యుడిగా ఉన్న రాజధాని ప్రాంత టీడీపీ సీనియర్ నాయకుడు స్పష్టం చేశారు. అసలు సొంత పార్టీ నేతలే ఎదురుతిరగడంతో చంద్రబాబు మాట మార్చారు. రెండో దఫా భూసమీకరణను కుదించారు. తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాలు, అమరావతి మండలంలో కొన్ని గ్రామాలకే పరిమితం చేశారు. అయినప్పటికీ పెదపరిమి గ్రామ రైతులు బహిరంగంగా మైకులు పెట్టి మరీ భూములివ్వం అంటూ ఎదరుతిరగడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సేకరణ పేరుతో ప్రభుత్వం భూములు లాక్కొనేందుకు యత్నిస్తోందని, తాము తిరగబడతామని రైతులు స్పష్టం చేస్తున్నారు. తొలి విడతలో భూములిచ్చిన రైతులకు న్యాయం చేయకుండా మళ్లీ భూసేకరణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం కనుమరుగు చేసేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు నట్టేట ముంచుతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో బాబు తాత్కాలికంగా ఈ వ్యవహారాన్ని పక్కనపెట్టినట్లు సమాచారం.



భూములు ఇవ్వమని గ్రామాల్లో మైక్ ప్రచారం

సొంత సామాజిక వర్గమే బాబుకు ఎదురు తిరగడంతో ప్రభుత్వంలో కలకలం రేగింది. ఇప్పటికే తీసుకున్న 33 వేల ఎకరాలను అభివృద్ధి చేసి మేలు చేస్తావనుకుంటే మరోసారి సమీకరణ పేరుతో నోళ్లు కొడతారా ? అంటూ గ్రామాల్లో రైతులు దుర్భాషలాడుతున్నారు. భూసమీకరణకు తాము భూములు ఇచ్చేది లేదంటూ గ్రామాల్లో మైక్ ప్రచారం కూడా చేయడం సంచలనంగా మారింది.



పొన్నెకల్లులో తిరగబడి గోబ్యాక్ అంటున్న టీడీపీ నాయకులు, రైతులు

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, ఎండీ పుల్లారెడ్డి



కొరిటెపాడు(గుంటూరు): ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి ఆదేశించారు. పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవనం ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో ఇంజినీరింగ్ సిబ్బంది, ఉద్యోగులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ లోవోల్టేజ్ సమస్యలను అధిగమించి, ప్రజలకు నిరంతర విద్యుత్ అందించాలని ఆయన సూచించారు. బకాయిలపై దృష్టి పెట్టాలని, ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి, రైతులకు త్వరితగతిన ఇవ్వాలని సూచించారు. సంస్థ అభివృద్ధి కోసం పాటుపడాలని చెప్పారు. విధుల్లో అలసత్వం వహించినా, ఫిర్యాదులు అందినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఎ.మురళీకృష్ణ యాదవ్, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ సీజీఎం రాందాస్, గుంటూరు పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్. రమేష్, డివిజనల్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటిలోగా ఫిర్యాదులు పరిష్కరించుకోవాలి

డీఏఓ అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): అన్నదాత సుఖీభవ ఫిర్యాదులను రైతులు ఈనెల 13వ తేదీలోపు పరిష్కరించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ)అయితా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులను పరిష్కరించడానికి సెలవు రోజుల్లో (12, 13వ తేదీల్లో) కూడా అందుబాటులో ఉండాలని ఆర్ఎస్‌కేల సిబ్బందిని ఆయన ఆదేశించారు.

కూటమి పాలనలో రాష్ట్రం రావణ కాష్టం



నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై చర్చిస్తున్న మేరుగ నాగర్జున, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ

- మాజీ మంత్రి మేరుగ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ
- నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీసిన నేతలు

పట్నంబజారు: రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం రావణ కాష్టంగా మారుస్తోందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. చంద్రబాబుకు తొలి నుంచి దళితులంటే చిన్న చూపేనని, వారు ఎదుగుతుంటే ఆయన ఓర్చుకోలేరని విమర్శించారు.టీడీపీ గూండాల చేతిలో దాడికి గురై, గుంటూరు రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొన్నూరు నియోజకవర్గం మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సమీక్షించారు. శుక్రవారం మాజీ మంత్రి, పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పార్టీ నేతలతో కలిసి రమేష్ ఆస్పత్రికి వచ్చారు. నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన్ని స్వయంగా చూసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడారు. నాగమల్లేశ్వరరావు కోలుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

నరేంద్ర ప్రోద్బలంతోనే దాడి

మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రోద్బలంతోనే నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిందని మండిపడ్డారు. గీటు దాటితే భూస్థాపితం చేయాలని మహానాడులో నరేంద్ర మాట్లాడిన మాటలు ప్రతి ఒక్కరికీ తెలిసిందేనని తెలిపారు. దశాబ్దాలు తరబడి ప్రజలకు సేవలందిస్తున్న ఒక దళిత కుటుంబంపై ఘోరమైన దాడులు చేయడం సిగ్గుచేటని ఖండించారు. నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి ఇప్పటికీ విషమంగానే ఉందని, హింసా రాజకీయాలు చంద్రబాబుకు కొత్త కాదని ధ్వజమెత్తారు. కచ్చితంగా ఎమ్మెల్యే నరేంద్రను ఏ-1గా చేర్చి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

పెరిగిన హత్యలు

ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని తెలిపారు. కూటమి ఏడాది పాలన మొత్తం కేవలం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలే టార్గెట్‌గా కొనసాగిందని మండిపడ్డారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు, అరెస్టులు, దౌర్జన్యాలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. హింసావాద రాజకీయాలను కూటమి ప్రభుత్వం ప్రత్యక్షంగానే ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు.

పక్కా ప్లాన్ ప్రకారం దాడి

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నాగమల్లేశ్వరరావు ఆరోగ్యం రోజురోజుకూ ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే నాగమల్లేశ్వరరావును హత్య చేసేందుకు ప్రయత్నించారని ధ్వజమెత్తారు. గతంలో సైతం ఆయన సోదరుడిపై వెంటపడి మరి దాడి చేసి గాయపరిచిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అసలు పొన్నూరు నియోజకవర్గాన్ని ధూళిపాళ్ల ఏం చేద్దామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో తన పట్టు కోసం హత్యా రాజకీయాలు చేయడం దుర్మార్గమని ఖండించారు. నాగమల్లేశ్వరరావుపై దాడి ఘటనలో నరేంద్రపై కేసు నమోదు చేయాలని, ఇది పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన దాడి అని మండిపడ్డారు. బాధితుడికి అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని స్పష్టం చేశారు. నరేంద్ర నీచ రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, షేక్ మస్తాన్ వలి, నూనె ఉమామహేశ్వర్‌రెడ్డి, న్యాయవాది బ్రహ్మారెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

సుపరిపాలన కాదు.. రుబాబు పాలన

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

పట్నంబజారు: రాష్ట్రంలో దుష్టపాలన సాగిస్తూ ... సుపరిపాలన అని చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమాలు స్కానర్‌లకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ మోసానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని విమర్శించారు. మిత్రపక్షమైన బీజేపీ కనీసం మేనిఫెస్టో కూడా పట్టుకోని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చిన వైఎస్సార్ సీపీకి 11 సీట్లు రావడంపై సర్వత్రా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్లల్లోకి వెళ్లి దాడులు, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడిన పరిస్థితులు దారుణమని ఖండించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను సైతం కేసులు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. 1989 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఇంతటి నీచ పాలన ఎప్పుడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు అంటున్నారని, అసలు ఏం అఘోరించావు చంద్రబాబు ? అని ప్రశ్నించారు. అసలు వైఎస్సార్ సీపీ పోరాటంతోనే తల్లికి వందనం పడిందనడంలో ఎలాంటి సందేహం లేదని తెలిపారు. ఆఖరికి అమ్మ ఒడి సైతం తన కుమారుడు ఆలోచనేనని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని మోసం చేశామని బాధపడుతున్నారని తెలిపారు. సాక్షి చానల్ ప్రసారాలు నిలిపివేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై ప్రతి ఒక్క కార్యకర్త కచ్చితంగా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నిజమైన వైఎస్సార్ సీపీ కార్యకర్త టీవీ ప్రసారాలు ఎందుకు రావడం లేదంటూ కేబుల్ ఆపరేటర్‌ను నిలదీయాలని చెప్పారు. సాక్షి వీక్షకుల సమావేశాన్ని ఏర్పాటు చేసే దిశగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

కూటమి పాలనపై వ్యతిరేకత

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయాన అబద్ధాలు చెప్పి గెలుపు తరువాత కనీసం గడప వైపు కూడా కూటమి ప్రభుత్వం చూడటం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను ఒకే ఒక్క పేజీలో ప్రజలకు అందుబాటులో కనిపించేలా ఉంచిందని, దాన్ని పవిత్ర గ్రంథంలా చూసిందని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో కూటమిపై స్పష్టమైన వ్యతిరేకత కనబడుతోందని పేర్కొన్నారు. వై.ఎస్.జగన్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, సంక్షేమ పథకాలు అందని పరిస్థితులను ప్రజలకు వివరించాలని సూచించారు. ఏడాదిలో విఫలమైన ఇటువంటి ప్రభుత్వాన్ని తాను ఎప్పుడూ చూడలేదని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటని, అక్కడ ఓడిపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని, నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమాను అసెంబ్లీకి పంపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, అనుబంధ విభాగాల అధ్యక్షులు వాసిమళ్ల విజయ్, గనిక ఝాన్సీరాణి, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నేతలు, నగర, జిల్లా కమిటీ నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు. వేదికపై ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



హాజరైన నాయకులు, కార్యకర్తలు

మోసానికి నిలువెత్తు రూపం బాబు

గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ నిజమనే మాటకు నిలువెత్తు రూపం ఉందంటే అది వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని, అబద్ధానికి అద్దం పడితే అది చంద్రబాబు అని పేర్కొన్నారు. ప్రజలకు చంద్రబాబు ఊసరవెల్లి మాటలను తెలియజెప్పాలని, అందుకే ఇటువంటి గొప్ప కార్యక్రమానికి జగనన్న శ్రీకారం చుట్టారని వివరించారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి సంక్షేమాన్ని ప్రజల గడప వద్దకు చేరిస్తే, జగనన్న నేరుగా ఇంటి లోపలకు తీసుకెళ్లారని చెప్పారు. పొదిలిలో పొగాకు రైతులు, బంగారుపాళెంలో మామిడి రైతులు, గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి రైతులను పరామర్శించేందుకు వస్తే వందలాది మంది పోలీసులతో ఆంక్షలు పెట్టి ఆపుదామనుకుంటే అది అసంభవం అనే విషయం గుర్తించాలని హితవు పలికారు. నిజం వెంట నడిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజల పక్షాన గొంతుకై నిలిచిన సాక్షి పక్షాన అండగా నిలబడాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు నిలదీస్తారనే భయంతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కూటమి నేతలు వెళ్లలేని దుస్థితి దాపురించిందని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

భర్తను హతమార్చిన భార్యకు జీవిత ఖైదు

నరసరావుపేట టౌన్: ప్రియునితో కలిసి భర్తను హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితురాలు వినుకొండకు చెందిన శ్రీగిరి స్వాతి, ఆమె ప్రియుడు పట్టేపురం మారుతీబాబులకు జీవిత ఖైదు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్. సత్యశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలు.. శ్రీగిరి కుమార్ (38)తో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం బయ్యారం గ్రామానికి చెందిన స్వాతికి వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. స్వాతికి వినుకొండకు చెందిన పట్టేపురం అలియాస్ రాజారపు మారుతీబాబుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంపై కుటుంబంలో కలహాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో 2023 ఫిబ్రవరి 11వ తేదీన కుమార్ మద్యం మత్తులో ఇంట్లో నిద్రిస్తుండగా స్వాతి, మారుతీబాబు కలిసి కుమార్ మెడకు తాడు బిగించి హతమార్చారు. కుమార్ తల్లి మేరీ రోజ్లిన్ దీనిపై వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,600



పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 834

కొమ్ములు : 509 బస్తాలు

	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,281	10,050

కాయలు : 325 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,300	10,050

మొత్తం అమ్మకాలు : 625.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	35,320
అమ్మకాలు	39,226
నిల్వ	3,208

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,700
నంబరు-5	10,000-13,400
341	10,000-13,500
4884	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,500
బాడిగ-355	10,000 - 12,500
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,400
బాడిగ - 355	10,000-12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
తాలు	5,200 - 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

రైతుల నుంచి మొత్తం పొగాకు కొనుగోలు చేయాలి

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్
- పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన రైతు సంఘ నాయకులు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు

లక్ష్మీపురం: జిల్లాలో రైతుల నుంచి మొత్తం నల్లబర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. నాణ్యత లేదనే పేరుతో తిప్పి పంపడం సరికాదని తెలిపారు. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెట్ యార్డులో శుక్రవారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఫిరంగిపురం మండలంలోని తక్కెళ్లపాడు, కండ్రిక, మేరికపూడి గ్రామాల రైతులతో మాట్లాడారు. నల్లబర్లీ పొగాకులో తేమ శాతం ఎక్కువగా, నాసిరకంగా ఉందనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సీ గ్రేడ్ కింద 80 శాతం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, క్వింటాకు ఆరు వేల రూపాయలు మాత్రమే దక్కుతుందని తెలిపారు. కండ్రిక గ్రామానికి చెందిన కాంతారావు అనే రైతు 16 చెక్కులు తీసుకు రాగా, నాసిరకంగా ఉందని 10 తిప్పి పంపేశారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మరో రైతు రామయ్య నాలుగు చెక్కులు కొనగోలు కేంద్రానికి తీసుకురాగా రెండు తిప్పి పంపారని చెప్పారు. ఫిరంగిపురం మండలం మేరిక పూడి గ్రామానికి చెందిన రైతు ముక్కంటి 55 చెక్కులు తీసుకు రాగా మొత్తం తెచ్చిన ట్రాక్టర్‌లోనే అధికారులు వెనక్కి పంపారని వివరించారు. ఈ స్థితిలో రైతాంగానికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధిక వడ్డీలకు అప్పు చేసి పంట పండిస్తే కొనగోలు కేంద్రాల్లో తక్కువ ధర వేయడం, తిప్పి పంపడం సరికాదని పేర్కొనారు. తెచ్చిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం 30వేల టన్నులు ఉత్పత్తి కాగా ఇప్పటికి నాలుగు వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ స్థితిని గమనించి ప్రైవేటు కంపెనీలు గ్రామాలలోనే తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కొనుగోలు వేగం పెంచాలని, లేనిపక్షంలో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.కృష్ణ పాల్గొన్నారు.

మంత్రితో జరిగిన ఒప్పందాన్ని అమలుచేయాలి

పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు డిమాండ్



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులతో శివశంకరరావు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులకు ప్రభుత్వ ఒప్పందం ప్రకారం క్వింటాలుకు రూ.7,000 చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర రావు డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదం జరిగి 17 నెలలు గడిచిందని, ప్రభుత్వంతో ఒప్పందం జరిగి ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. ఇప్పటికీ న్యాయం జరక్క రైతాంగం ఆందోళన చెందుతోందని తెలిపారు. బాధిత రైతులు శుక్రవారం తెనాలిలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహను కలిసి సమస్యపై మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పసుపు రైతులకు రూ.20 కోట్ల బీమా పరిహారం వచ్చిందని సబ్ కలెక్టర్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ ప్రకారంగా చూస్తే బాధిత రైతులకు క్వింటాలుకు రూ.3–4 వేలు మాత్రమే వస్తుందని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడుతో గతేడాది జులై 10న విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో జరిగిన ఒప్పందం ప్రకారం నష్టపోయిన పసుపు రైతులందరికీ క్వింటాకు రూ.7,000 ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్ని ప్రమాదం జరిగిన రోజు మార్కెట్లో క్వింటాలు రూ.13–14 వేలు ఉందని, మార్కెట్ యార్డులో రూ.10,900 ధర పలికిందని గుర్తు చేశారు. తాము నష్టపోతున్నామని తెలిసినా పసుపు రైతులు క్వింటాలుకు రూ.7,000 చెల్లింపునకు అంగీకరించారని శివశంకరరావు చెప్పారు.

అప్పులతో రైతుల అవస్థలు

అగ్ని బాధిత పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మరోవైపు వ్యవసాయం చేసేందుకు చేతిలో డబ్బులు లేని పరిస్థితి ఉందని తెలిపారు. 14 రోజుల కిందట మంత్రి నారా లోకేష్‌ను కలిసినపుడు మంత్రి అచ్చెన్నాయుడుకు బాధ్యత అప్పగించినట్టు చెప్పారని తెలిపారు. బీమా పరిహారం నగదు జాయింట్ అకౌంటులో పడిందని సబ్ కలెక్టర్ చెప్పారని, మిగతా పరిహారం కూడా త్వరగా జమ చేసేలా చూడాలని కోరారు. పసుపు రైతులు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ రైతాంగం మళ్లీ రోడ్డు ఎక్కకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పసుపు రైతు లంకిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గద్దె శ్రీహరి బసవయ్య, చందు సత్యనారాయణ, ఆళ్ల గోవిందరెడ్డి, యర్రా వెంకటేశ్వరరావు, గొల్లపల్లి వెంకటసుబ్బారావు, శివారెడ్డి, చందు సత్యనారాయణ, నాదెళ్ల చంద్రశేఖర్, పోతరాజు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుగురాజు కాంస్య విగ్రహానికి రూపకల్పన

- పిడుగురాళ్లలో ప్రతిష్ట నిమిత్తం రూపొందించిన తెనాలి శిల్పులు
- 12వ శతాబ్దంలో పల్నాడును పాలించిన అనుగురాజు
- 700 కిలోల కంచుతో తొమ్మిది అడుగుల నిలువెత్తు విగ్రహం



అనుగురాజు కాంస్య విగ్రహంతో శిల్పులు, విగ్రహ కమిటీ సభ్యులు

తెనాలి: పన్నెండో శతాబ్దంలో పల్నాడును పరిపాలించిన అనుగురాజు విగ్రహాన్ని తెనాలికి చెందిన ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలు రూపొందించారు. ఆయన చరిత్రకు సంబంధించిన ఫొటోలు అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, విగ్రహ కమిటీ సూచనతో శిల్పకారులు పలు డ్రాయింగులు, కంప్యూటర్ డిజైన్లను తయారుచేశారు. ఆ ప్రకారం తొమ్మిది అడుగుల నమూనాను తయారుచేసి కమిటీ సంతృప్తిని వ్యక్తంచేశాక 700 కిలోల కాంస్యాన్ని వినియోగించి అనుగురాజు విగ్రహాన్ని సిద్ధం చేశారు. చారిత్రక ఆధారాల ప్రకారం అనుగురాజు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ ప్రాంతం నుంచి వచ్చి పల్నాడును పరిపాలించారు. ఆయన శరీరాకృతి, వస్త్రధారణను ఊహించి విగ్రహాన్ని రూపొందించామని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర చెప్పారు.
ఈ విగ్రహాన్ని పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో గంగమ్మతల్లి గుడి ఎదురుగా ప్రతిష్ఠించనున్నారు. విగ్రహ కమిటీ సభ్యులు, అనుగురాజు యాదవ్ అభిమానులతో గురువారం ఆ విగ్రహాన్ని పల్నాడుకు తీసుకు వెళ్లారు.

పొగాకు బేళ్లకు నిప్పటించిన గుర్తు తెలియని వ్యక్తులు



కాకుమాను: గుర్తు తెలియని వ్యక్తులు పొగాకు బేళ్లకు నిప్పంటించిన సంఘటన పెదనందిపాడు మండలంలోని నాగభైరవారిపాలెంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. పరిటాలవారిపాలేనికి చెందిన ఓ రైతు బేళ్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించి పొగ కమ్మేయడంతో స్థానికులు యజమానికి సమాచారం అందించారు.
మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చిలకలూరిపేట నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి అదుపులోకి తెచ్చారు. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదు.

పట్టపగలే నివాసంలో చోరీ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): పట్టపగలు నివాసంలో చోరీ జరిగిన ఘటనపై ఫిర్యాదు అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాతగుంటూరు పోలీసుస్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే ఉప్పలపాటి అంకమ్మరావు తన కుటుంబంతో కలిసి అదే ప్రాంతంలో పలు పనుల నిమిత్తం వెళ్లారు. ఇంటికి వచ్చి చూసుకునే సరికి తలుపు తాళాలు పగుల కొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా, పెట్టెలో ఉన్న రూ.8 లక్షల నగదు, రెండున్నర సవర్ల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పాతగుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌వో వెంకటప్రసాద్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందినట్లు తెలిపారు. అయితే పలు వాస్తవాలు తెలియాల్సి ఉందని, బాధితుల నుంచి పలు అనుమానాలు నివృత్తి చేసుకున్న అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్: తెనాలి వన్ టౌన్ కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు వేము నవీన్‌ని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏప్రిల్ 24వ తేదీన చిరంజీవిపై వేము నవీన్ అలియాస్ కిల్లర్, చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్, బాబులాల్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇన్నాళ్లు తప్పించుకు తిరుగుతున్న నవీన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

బావమరిది దాడిలో బావ మృతి



కృష్ణబాబు మృతదేహం

చేబ్రోలు: అక్కాబావల మధ్య జరుగుతున్న వివాద విషయం తెలుసుకున్న బావమరిది అక్కడకు వెళ్లి బావతో గొడవ పడి క్షణికావేశంలో కర్రతో తలపై దాడి చేసి గాయపరచటంతో మరణించిన సంఘటన చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండవరం గ్రామానికి చెందిన నన్నపనేని కృష్ణబాబు (35)కు అదే గ్రామానికి చెందిన మక్కే భువనేశ్వరితో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వారం రోజుల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్ధల కారణంగా గొడవ పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కృష్ణబాబు, భువనేశ్వరిల మధ్య వివాదం జరుగుతుండటంతో భువనేశ్వరి తమ్ముడు గోపీకి ఫోన్ చేసి గొడవ జరుగుతున్న విషయాన్ని తెలియజేసింది. గోపి అక్కాబావల ఇంటికి వచ్చి గొడవ విషయం గురించి మాట్లాడుతుండగా బావ బావమరిదిల మధ్య మాటమాట పెరిగింది. క్షణికావేశంలో గోపి బావను సమీపంలో ఉన్న పెద్ద కర్రతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలై పడిపోయాడు. బంధువులు తీవ్ర గాయాలైన కృష్ణబాబును వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుని తల్లి నన్నపనేని వీరకుమారి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



నకరికల్లు: విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఈఓ ఏసుబాబు హెచ్చరించారు. నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోలేదని గురువారం తల్లిదండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి చూశారు. నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ముందుగా బియ్యం, కూరగాయలు నాణ్యతను పరిశీలించుకున్నాక వండాలని సూచించారు. వంట గదులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. మరోసారి నాణ్యత లోపించినా, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ కె.పుల్లారావు, జాలాది శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఉన్నత చదువులకు పేద విద్యార్థులు దూరం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ ఆగ్రహం



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు, విద్యార్థులు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వ చర్యల వల్ల ఉన్నత చదువులకు పేద విద్యార్థులు దూరం అవుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులను ఉన్నత చదువుకున్న దూరం చేసే జీవో నంబర్ 77 రద్దు చేయాలని, డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన కోరారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద మహాధర్నా నిర్వహించారు. అందులో భాగంగా గుంటూరు నగరంలో వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించి, డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తానని చెప్పిన లోకేష్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర గరల్స్ కన్వీనర్ బాల నవ్యశ్రీ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఉద్యోగాలు వచ్చినా వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల పూర్తయి మూడు నెలలు కావస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివ, సహాయ కార్యదర్శి అమర్నాథ్, నగర కార్యదర్శి అజయ్, రాహుల్, ఆనంద్, డేవిడ్, సాగర్, తేజ, కిరణ్, పవన్, ప్రణీత్ తపాల్గొన్నారు

తిరువూరు సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

తిరువూరు: తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణోతు జగన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మూడు రోజుల క్రితం ఆయనను సస్పెండ్ చేసిన అధికారులు సమాచారం బయటికి పొక్కకుండా గుట్టుగా ఉంచారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నానీకి తుళ్లూరులో 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఆయన ప్రమేయం లేకుండా శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి మరొకరికి విక్రయించినట్లుగా తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' విధానంలో సబ్ రిజిస్ట్రార్ జగన్ ఇటీవల రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై కోవెలమూడి నాని రిజిస్ట్రేషన్ శాఖకు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం తిరువూరు సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీచేశారు. తొమ్మిది నెలల క్రితం తిరువూరు సబ్ రిజిస్ట్రారుగా వచ్చిన జగన్ ఇదే తరహాలో కొందరు దస్తావేజు లేఖరులు, దళారులు, ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన దస్తావేజులను ఇష్టానుసారం రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయంలో ఏ పనికైనా బహిరంగంగానే అదనపు డబ్బు వసూలు చేసినట్లు కక్షిదారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపితే తిరువూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో అక్రమాలు వెలికి వచ్చే అవకాశం ఉంది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన ఊదరగుడి సురేష్ కనిపించడం లేదని అతని తండ్రి మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పట్టాభిరామయ్య శుక్రవారం తెలిపారు. సురేష్ ఈ నెల 8వ తేదీ ఉదయం బాపట్ల దగ్గరలో ఉన్న నరసాయపాలెం గ్రామంలో అతని బంధువు చనిపోవడం వలన అక్కడికి వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం 8 గంటలకు మార్టూరు వచ్చాడు. అక్కడ నుంచి ఇంటికి వస్తున్నానని భార్య నాగవేణికి ఫోన్ చేసి చెప్పాడు. అయితే తర్వాత ఎంతకీ రాకపోవడతో భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళన చెందారు. ఎత్తు 5 అడుగుల 5 అంగుళాలు, ఎరుపు రంగుతో ఉంటాడని, బయటకు వెళ్లేటప్పుడు మెరూన్ రంగు నిండు చేతుల చొక్కా, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. సదరు వ్యక్తి గురించి తెలిసిన వారు సంతమాగులూరు ఎస్ఐ 9121102168 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

20న స్వర్ణలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభ

బాపట్ల: కారంచేడు మండలం స్వర్ణలో ఈ నెల 20న ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు పి.కొండయ్య చెప్పారు. శుక్రవారం బాపట్లలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండయ్య మాట్లాడారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, ఏ పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రధానంగా కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు కౌలు రేట్లు పెంచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కౌలు రైతుకు ఇచ్చే రాయితీలు అందడం లేదని అన్నారు. ఈ సమస్యలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. సభలకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్.గంగయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామారావు హాజరవుతారని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి వై.ఎస్.రావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ రావు

బాపట్ల టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయీస్ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ కార్యదర్శి వైఎస్ రావు తెలిపారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఆవరణంలో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్ రావు మాట్లాడుతూ 74 సంవత్సరాలుగా ఎంప్లాయీస్ యూనియన్ ఆర్టీసీ కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతోపాటు వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఉద్యోగులకు కావాల్సిన సౌకర్యాలు, వారికి రావలసిన రాయితీలు, ఉద్యోగులకు అందించే ప్రయోజనాల కోసం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బాపట్ల డిపో కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయించడంలో, సమాన పనికి సమాన వేతనం, యూనిఫామ్ ఇప్పించడం, వైద్య సౌకర్యాలు అందించడంలో ఎంప్లాయీస్ యూనియన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బాపట్ల డిపో అధ్యక్షులు టి.చంద్రశేఖర్, టి.యస్.నారాయణ, ఎం.కోటేశ్వరరావు గ్యారేజ్ సెక్రటరీ చలపతి, సి.సి.ఎస్. డెలిగేట్ ఎం.పి.కుమార్, సీనియర్ సభ్యుడు ఐ.యస్.రావు, బాపట్ల జిల్లా ఏపీ జేఏసీ అమరావతి మహిళా చైర్‌పర్సన్ పి.రజిని పాల్గొన్నారు.